వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

రోగులు, సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమహారతి

తాండూరు, అక్టోబర్ 10: జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమహారతి పేర్కొన్నారు. గురువారం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలతో పాటు మందుల నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడుతూ ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా సకాలంలో వైద్యం అందించాలన్నారు. రోగులకు ఇచ్చే మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్, ఆర్ఎంవో ఆనంద్‌గోపాల్‌రెడ్డి ఉన్నారు.

చిన్న చిన్న సమస్యలతో ఒత్తిడికి గురి కావద్దు

వికారాబాద్, అక్టోబర్ 10 : చిన్న చిన్న సమస్యలతో ఒత్తిడికి గురికావద్దని మానసిక వైద్యులు డాక్టర్ మనోజ్, శ్రీకాంత్, ప్రోగ్రాం అధికారిణి నిరోష సూచించారు. గురువారం కమిషనర్, జిల్లా వైద్య , ఆరోగ్య అధికారుల ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు ఒత్తిడికి గురి కాకుండా, పోషకాహారం తీసుకుంటూ, కుటుంబ సభ్యులతో, మిత్రులతో సంతోషంగా గడపాలన్నారు. మానసిక అనారోగ్యం ఉన్నవారికి, పరిష్కరించుకోవడానికి మార్గాలు వివరించాలన్నారు. మత్తు పానీయాలు మానేయడం వలన, ఉద్రిక్తతలకు గురికాకుండా ఉండేందుకు యోగా, శారీరక శ్రమ చేయాలని సూచించారు. సమీప ఆసుపత్రులలో చూపించుకొని, ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. మానసిక సమస్యలకు టెలీమానస్ కాల్స్ 14416 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని, ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు , ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ , జిల్లా ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ రేణు కుమార్, కౌన్సిలర్ మురళి, సీహెచ్‌వో ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం..

కరెంట్ కొత్తలైన్‌కు స్విచ్ ఆన్ చేస్తున్న కాలనీవాసులు

బంట్వారం అక్టోబర్10 : విద్యుత్ విషయంలో తొరుమామిడి గడ్డమీది ఇండ్ల వాసులకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీలో ప్రత్యేకంగా గృహావసరాలకు ఇచ్చే విద్యుత్ సరఫరా చేయకపోవడంతో నానా అవస్థలు పడుతుండేవారు. కేవలం వ్యవసాయ విద్యుత్ సరఫరాతోనే సరిపెట్టుకున్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకు వచ్చారు. ఇదే కాక మండల సర్వ సభ్య సమావేశాల్లో సైతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మొరపెట్టుకున్నా పరిష్కారం కాలేదు. చివరగా ఈ సమస్యను పరిష్కరించాలని ప్రస్తుత స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు మొరపెట్టుకోవడంతో ఆయన అధికారులకు సమస్యను త్వరగా పరిష్కరించాలని సూచించారు. వెంటనే స్థానిక డీఈ ఆదేశాల మేరకు ఏఈ రంగారెడ్డి పది రోజుల క్రితం సర్వే నిర్వహించి, ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం స్విచ్ ఆన్ చేసి, విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, స్పీకర్‌కు, డీఈ, ఏఈలకు స్థానిక నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

వికారాబాద్, అక్టోబర్ 10: వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి సమీపంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం వికారాబాద్ ఎంపీడీవో వినయ్‌కుమార్ తనిఖీ చేశారు. దవా ఖానలోని సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై సందర్శించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. వారితో పాటు మెడికల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

కొడంగల్, అక్టోబర్ 10: బొంరాస్‌పేట మండల కేంద్రంలోని దుర్గా మాత దేవాలయంలో గురువారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుటుంబ సమేతంగా అమ్మవారికి కుంకుమార్చన చేసి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం పాల్గొన్న భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

తాండూరు: బతుకమ్మ ఆడుతున్న మహిళలతో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

వికారాబాద్: డాక్టర్ సబితాఆనంద్, మహిళా కౌన్సిలర్లు

చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో..

ఘనంగా సద్దుల బతుకమ్మ

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: బతుకమ్మ సంబురాలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్కపూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట చేర్చి మహిళలు ఆడిపాడారు. బతుకమ్మ పండగ చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా రకరకాల పువ్వులతో గౌరమ్మను పేర్చి ఆట, పాటల మధ్య గౌరమ్మను పూజించారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత తమ నివాసం వద్ద బతుకమ్మ ఆట, పాట నిర్వహించారు. తాండూరులో మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టమైన తెలంగాణ సంస్కృతిని చాటి చెబుతుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ ఉత్సవాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించేదన్నారు. అన్ని వర్గాల మహిళలు పాల్గొని ఉత్సాహంగా ఆడిపాడేవారని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ పాలనలో ఎక్కడా అంతా ఉత్సాహం కనిపిస్తలేదన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పాలన వస్తుందని మళ్లీ పండుగలు అత్యంత వైభవంగా చేయడంతో పాటు ప్రజలకు కావాల్సిన సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌గౌడ్ ఉన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో బతుకమ్మ సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆట, పాటలతో బతుకమ్మలను ఊరేగింపు నిర్వహించి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలి



దుర్గామాతకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, అక్టోబర్ 10 : అమాయక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించేలా చూడాలని గురువారం వికారాబాద్ పట్టణంలోని 26వ వార్డులోని సరస్వతీ నగర్‌లో దుర్గామాతకు మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను, రైతులను మోసం చేశారని విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు గయాజ్, నాయకులు వేణుగోపాల్, మల్లేశం, అశోక్, పాండు ఉన్నారు.

బాధిత కుటంబానికి పరామర్శ

అకాల మృతి చెందిన ఉపాధ్యాయుడు నర్సింహులు కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పరామర్శించారు. నర్సింహులు ఉపాధ్యాయుడు, రచయిత, కవి, గాయకుడుగా ఎంతో పేరు సంపాదించారని కొనియాడారు. వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్, నాయకులు గయాజ్ , అశోక్ తదితరులు ఉన్నారు.

వికారాబాద్, అక్టోబర్ 10: వికారాబాద్ ఆలంపల్లి అనంత పద్మనాభస్వామి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం శ్రీ అనంతపద్మనాభస్వామి సింహవాహనంపై ఊరేగారు. ఈ ఊరేగింపులో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ పాల్గొన్నారు.

మరో అసెంబుల్డ్ బోర్‌వెల్ వాహనం పట్టివేత

పరిగి, అక్టోబర్ 10: పది రోజుల వ్యవధిలో పరిగి పోలీసులు మరో అసెంబుల్డ్ బోర్‌వెల్ వాహనాన్ని పట్టుకున్నారు. అసెంబుల్డ్‌గా బోర్‌వెల్ వాహనం తయారు చేసి ఎలాంటి పన్నులు చెల్లించకుండా, విదేశాలకు తరలిస్తుండగా పరిగి పోలీసులు పట్టుకున్నారు. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పరిగి పట్టణంలో గురువారం తెల్లవారుజామున పోలీసులకు అందిన సమాచారం మేరకు నెంబర్ ప్లేట్ లేని బోర్‌వెల్ బండిని ఆపి పత్రాలు చూపించమనగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీ సుల విచారణలో గురువారం పట్టుబడిన వాహనం సైతం హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో బోర్ డ్రిల్లింగ్ వాహనాన్ని అసెంబుల్డ్‌గా ఫిట్ చేసి ఎలాంటి పత్రాలు లేకుండానే పరిగి, కర్నాటక మీదుగా మహారాష్ట్రలోని ముంబై పోర్టు ద్వారా జాంబియా దేశానికి తరలి స్తున్నట్లు తేలింది. ఎలాంటి పన్నులు, జీఎస్‌టీ చెల్లించకుండా, ఎగుమతులకు సంబంధించిన పన్నులు సైతం ఎగవేసి అసెంబుల్డ్ బోర్ వెల్ వాహనాలను జాంబియాకు తరలించడం వెనకాల ఎవరున్నారన్నది పోలీసులు ఇప్పటివరకు తేల్చలేకపోయారు. కేవలం వాహనం పట్టుకొని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. రెండవ వాహనాన్ని సైతం పరిగి పోలీసులు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు ఈ అసెంబుల్డ్ వాహనాల తయారీ సూత్రధారులు పట్టుబడే అవకాశం ఉండగా రవాణా శాఖ అధికారులకు అప్పజెప్పి తమ చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో కూపీ లాగితే తెరవెనుక గల అసలు సూత్రధారులు బయటపడతారని, వారిపై చర్యలు తీసుకుంటే ఈ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు పేర్కొంటున్నారు. తద్వారా ప్రభుత్వ ఖాజానాకు నష్టం జరగకుండా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

వికారాబాద్, అక్టోబర్ 10 : శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వికారాబాద్ పట్టణంలో రథోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేంకటేశ్వర ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రోడ్డుపై స్వామివారి రథోత్సవం ఘనంగా సాగింది. ఇందులో భాగంగా మహిళలు, చిన్నారులు కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి పట్టణ ప్రజలు పూజలు చేశారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు

తాండూరు, అక్టోబర్ 10: ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులపై గురువారం తాండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ కృష్ణ బుధవారం రాత్రి విధులు నిర్వహించి ఇంటికి వెళుతున్న సమయంలో తాండూరులోని మురళి కిరాణా దుకాణంలో కోడిగుడ్లు కొంటుండగా సాయిపూర్‌కు చెందిన ఫజల్, జగదీశ్, గోపాల్ మద్యం తాగుతున్నారు. రోడ్డుపై మద్యం తాగకూడదని చెప్పి ఇంటికి వెళ్లాడు. ఆ ముగ్గురు కలిసి కృష్ణ ఇంటికి వెళ్లి ఎక్కడ మందు తాగితే నీకేంటి అని పరుష పదజాలంతో తిడుతూ కొట్టారు. దీంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ కృష్ణకు గాయాలయ్యాయి. బాధితుడు వెంటనే తాండూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పంచనామా నిర్వహించి దాడిచేసి గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

నేడు డీఈవో కార్యాలయంలో

రిపోర్ట్ చేయాలి

వికారాబాద్, అక్టోబర్ 10 : డీఎస్సీ 2024 లో ఎంపిక కాబడి హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో 9న నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో సాయంత్రం 4 గంటల లోపు అందజే యాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణు కాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేకాట ఆడుతున్న

ఎనిమిది మంది అరెస్ట్

మన్సూరాబాద్, అక్టోబర్ 10: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, మమతానగర్ కాలనీ, లక్ష్మీప్లైడ్ రెసిడెన్సీ ఫ్లాట్ నెం. 301లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం మేరకు సదరు ఫ్లాట్‌పై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న బైరామల్‌గూడ, సాయిరాంనగర్ కాలనీకి చెందిన మక్కపాటి శ్యాంసుందర్, సూర్యానగర్ కాలనీకి చెందిన కర్న లలితకిషోర్, రాక్‌టౌన్‌కాలనీకి చెందిన వేముల క్రిష్ణారెడ్డి, ఖమ్మం, ఇల్లందుకు చెందిన బట్టడనంద కిషోర్, చాణక్యపురికాలనీకి చెందిన మందాడి శ్రీనివాస్‌రెడ్డి, బాలాపూర్, జల్‌పల్లికి చెందిన సురెడ్డి గోపాల్‌రెడ్డి, బడంగ్‌పేట్‌కు చెందిన మాదాల శివకుమార్, ఇంద్రప్రస్తకాలనీకి చెందిన నిమ్మల శంకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 79, 250 వేల నగదు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎంప ఇంటర్నేషనల్ స్టడీస్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ ఇంటర్నేషనల్ స్టడీస్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

విజేతలకు మిక్సీలు పంపిణీ..



విజేతలకు మిక్సీలు అందజేస్తున్న రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 10: సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల్లో టోకెన్స్ పంపిణీ చేశారు. కాగా గురువారం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో లక్కీ డ్రా చేపట్టారు. డ్రాలో గెలుపొందిన 108 మందికి మిక్సీలను రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, పున్నచంద్ లాహోటీ తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను వేధించిన నిందితుడు రిమాండ్

హయత్‌నగర్, అక్టోబర్ 10 : మైనర్‌ను వేధించిన కేసులో ఓ నిందితుడిని రిమాండ్‌కు తరలించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీకి చెందిన కొర్ర సంతోష్(20), వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొద్దిరోజులుగా ఇంటి పక్కనే ఉన్న ఓ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు నిర్వహించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

NOTICE

My Client Name: HARINARTHINI VEERA NARAYANA, S/o. HARINARTHINI BHADRAIAH aged about 56 Years, Occ: Business, R/o. House No. 1-2-219/a, Nageswara Rao Nagar Colony, Kothapet, Saroornagar, Ranga Reddy Dist. Cell No.9989298515. My Client Purchase of Plot Onginal Sale Deed bearing Document No. 11061/1984 from G.P.A, N ASHOK KUMAR S/o. ANTHAIAH (SRO), Hayathnagar, bearing Plot No. 38/B, admeasuring 111 Sq.Yards, in Survey No. 392, 394 & 395 PART Situated at Pasumamula Village, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, My Client Original Document was lost at When I was coming in an auto Pedda amberpet to Hayath Nagar at 12.00pm. on 01.07.2013. On date 20.07.2023 I did G.P.A my Friend Name as K MUTTAIAH. So far I thought that whoever found my address would give it. But no found. So that I request to you kindly Public notice Publish in your esteemed Organization of Namaste Telangana to my client favour.

Thanking you

Sd/- **E MALLESH**
B.Com., B.Ed., M.A, LL.B
T.S. High Court Advocate
Off: 3-163, Pedda Amberpet,
Abdullapurmet (M), R.R. Dist-501505.
Cell: 8121519950, 9640658085

బడంగ్‌పేటలో చెత్త పంచాయితీ

- చెత్త ఆటోలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన
- మూడు రోజులుగా అదే తతంగం
- చెత్త సమస్యను పట్టించుకోని పాలక వర్గం

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చెత్త ఆటోలతో నిరసన

బడంగ్‌పేట, అక్టోబర్ 10: బడంగ్‌పేటలో చెత్త పంచాయతీ చిలికి చిలికి గాలివానగా మారింది. చెత్త ఎక్కడ వేయాలో తెలియక.. చెత్త ఆటోలను మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉంచి నిరసన చేపట్టారు. చెత్త ఆటో రిక్షా యజమానులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతూ చెత్త ఆటోల నిర్వాహకులు అధికారులకు, మేయర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అయినా, సమస్య పరిష్కారం కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుర్మల్‌గూడలో చెత్త డంప్ చేసేందుకు వెళితే అక్కడి స్థానికులు వేయనివ్వడం లేదని చెబుతున్నారు. అదేవిధంగా ఉప్పల్‌లో కూడా చెత్త వేయనివ్వడం లేదన్నారు. జవహర్‌నగర్‌లో కూడా వేయనివ్వడం లేదంటే.. మరి ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలని నేరుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆటోలతో కూర్చుంటున్నారు. 65 చెత్త రిక్షాలను మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉంచి నిరసన తెలిపారు. గతంలో చెత్తను రీసైక్లింగ్ చేయడానికి మిషన్లు ఏర్పాటు చేశారు. అవి మూడునాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. దీంతో చెత్త పంచాయతీ తారా స్థాయికి చేరింది. చెత్త వేయడానికి డంప్పింగ్ యార్డు ఉన్నా.. స్థానికులు అడ్డుకోవడంతో సమస్య జఠిలమైంది. పాలక వర్గ సభ్యులకు మాత్రం చెత్త సమస్యను పరిష్కరించాలన్న జాస లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరు పట్ల కాలనీ వాసులు సైతం మండి పడుతున్నారు. కుర్మల్‌గూడలో ఏర్పాటు చేసిన డంప్పింగ్ యార్డులో చెత్త వేయనీయమంటే ఎలా అని కమిషనర్ రఘు కుమార్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుర్మల్‌గూడలోనే చెత్త వేయిస్తామని ఆయన తెలిపారు. మరోసారి కుర్మల్‌గూడ వాసులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమిషనర్ అన్నారు.

PUBLIC NOTICE

On behalf of my client M/s. SHAKTHI VENTURES INDIA (P) LTD., Hyderabad, Represented by its Executive Director P. SRINIVAS, I am to state that my client is owner and possessor of open lands located in Survey Nos. 1270; 1271; 1272; 1274; 1281 and 1282 comprising Ac. 63-36Gts at Nandigoam Village and Mandal, R.R. District intends to give for Development to Sri NILESH AGARWAL R/o. Secunderabad after completion of all official formalities and connected legal aspects filed before Hon'ble High Court vide W.P. No. 16625/2024, In this context the general public and financial institutions are hereby cautioned that Sri. Annaram Narasimhulu S/o. Late. Narasaiah, M/s. Venkata Rao Memorial Trust, Hyderabad and Sri. Nitish Harwalkar have no LOCUS STANDI and TITLE on subject lands at any point of time. Further the proceedings issue in case No. B/1752/2018-ST/D1/1511/2021, Dt: 07-07-2021 have been in pending before the Hon'ble High Court. Keeping in view of the relinquishing deed executed vide document No.413 of 2019 and the orders of Hon'ble High Court, Hyderabad on CRP No. 5994 OF 2017 in OP. No.114 of 2008, the above mentioned persons / Trust are not having legal santity, to execute any type of documents on subject lands. Hence my client as well as the prospective Developers Sri. NILESH AGARWAL are not responsible if anybody enters any agreement with the above mentioned persons, Further my client has also informed to the District Collector, concerned about the display of notice boards and installation of fencing vide letter No. S/VI/Hyd/Spl/119-1, dated: 28-08-2024, while submitting photographs. Hence, finally it is cautioned that the tress passers will be procecuted and criminal complaint would be lodged against all the persons who are being involved directly and indirectly in the subject lands.

Pochiraju Rameswara Prasad, LLM
Advocate
Flat no. 02, Sarada Apartment
H.No.6-3-790/3, Ameerpet, Hyderabad-016